పీఠాలు దక్కేనా..?

- మున్సిపాలిటీల్లో మారిన బలాలు
- పార్టీలు మారిన కౌన్సిలర్లు, ముంచుకొస్తున్న అవిశ్వాస ఘడియలు

మణికొండ: ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కొందరు కౌన్సిలర్లు పార్టీలు మారడంతో మున్సిపాలిటీల్లో ఆయా పార్టీల బలాబలాలు మారిపోయాయి. వారు ఎన్నికై 2024 జనవరి నెలకు 4 ఏళ్లు పూర్తి కానుండటంతో అవిశ్వాసాల ఘడియలు ముంచుకొస్తున్నాయి.

◆ గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం కొత్త మున్సిపాలిటీ చట్టాన్ని ఏర్పాటు చేసిన సమయంలో అవిశ్వాస తీర్మాణాలకు సమయం మూడేళ్లుగా నిర్ణయించింది. తీరా సమయం ముంచుకొచ్చేసరికి గతేడాది నాలుగేళ్లకు పొడగించిన విషయం తెలిసిందే. సదరు బిల్లు అసెంబ్లీలో ఆమోదించినా.. రాష్ట్ర గవర్నర్ వద్ద నెలల తరబడి పెండింగ్‌లో ఉంది. దాన్ని ఆసరా చేసుకుని కొన్ని మున్సిపాలిటీల్లో అవిశ్వాసాలను ప్రవేశపెట్టినా అధికారులు పట్టించుకోకపోవటంతో కోర్టులను సైతం ఆశ్రయించారు. ఎట్టకేలకు గవర్నర్ సదరు బిల్లును ఆమోదించటంతో అప్పట్లో అందరూ ఊపిరిపీల్చుకున్నారు.

◆ కొత్త చట్టం ప్రకారం నిర్ణీత నాలుగు సంవత్సరాల సమయం 2024 జనవరి నెలకు వస్తుండటంతో అవిశ్వాసాల అంశం మరోమారు తెరమీదకు వస్తుంది. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఆయా మున్సిపాలిటీలలో కొందరు కౌన్సిలర్లు పార్టీలు మారడంతో ప్రస్తుత బలాలు, అవిశ్వాస తీర్మానాల అవకాశాలపై మున్సిపాలిటీల్లో జోరుగా చర్చలు జరుగుతున్నాయి.

మణికొండలో..

మున్సిపాలిటీలో మొత్తం 20 మంది కౌన్సిలర్లు ఉండగా.. గత మున్సిపాలిటీ ఎన్నికల సమయంలో 8 మంది కాంగ్రెస్, 6 మంది బీజేపీ, 5 మంది బీజేపీ, ఒకరు స్వతంత్ర అభ్యర్థులుగా గెలుపొందిన విషయం తెలిసిందే. వారిలో ఇటీవల 1వ వార్డు కౌన్సిలర్ హైమాంజలి అనిల్‌కుమార్ బీజేపీ నుంచి గెలిచి బీఆర్‌ఎస్‌లో చేరారు. అదే బీజేపీలో గెలిచిన 8వ వార్డు కౌన్సిలర్ నవీన్‌కుమార్ గతేడాది బీజేపీ నుంచి బీఆర్‌ఎస్‌లో చేరారు. దీంతో మున్సిపాలిటీలో బీజేపీ బలం 6 నుంచి 4కు పడిపోయింది.

◆ బీఆర్‌ఎస్ బలం గతంలో 5మంది సభ్యులు ఉండగా.. వారిలో గెలిచిన 14వ వార్డు కౌన్సిలర్ యాలాల లావణ్య నరేష్ ఇటీవల కాంగ్రెస్‌లో చేరారు. దీంతో బీఆర్‌ఎస్ బలం ఒకరు కాంగ్రెస్‌కు వెళ్లి 4కు పడిపోగా.. ఇటీవల ఇద్దరు పార్టీలో చేరడంతో వారి బలం 5 నుంచి 6కు పెరిగింది. ఇక కాంగ్రెస్ పార్టీ తరపున మున్సిపల్ ఎన్నికల సమయంలో 8 మంది గెలుపొందగా.. అందులో 7వ వార్డు కౌన్సిలర్ పద్మారావు సస్పెన్షన్‌కు గురై కోర్టు ద్వారా తన పదవిని పొంది కొనసాగుతున్నారు. ఆయన పార్టీలో ఉన్నా మున్సిపల్ చైర్మన్ నరేందర్‌ముదిరాజ్‌కు వ్యతిరేకంగా ఓటు వేసేందుకు సిద్ధంగా ఉన్నట్టు సమాచారం. మద్దతు లేకున్నా.. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఒకరు పార్టీలో చేరడంతో వారి బలం యథాతథంగా 8కి, ఆయన మద్దతుంటే 9కి పెరుగుతుంది.

◆ అవిశ్వాసంతో పాటు పదవులను కాపాడుకునేందుకు ఇక్కడ తప్పనిసరి రెండు పార్టీలు కలవాల్సి ఉంటుంది. ఇప్పటి వరకు కాంగ్రెస్, బీజేపీలు కలిసి అధికారాన్ని కొనసాగిస్తున్నాయి. ప్రస్తుతం బీజేపీ, బీఆర్‌ఎస్‌తో జతకడితే తప్పా.. అవిశ్వాసానికి అవకాశం లేదు. అయినా కొందరు సభ్యులు అవిశ్వాసాన్ని పెట్టాలనే దిశగా ఆలోచన చేస్తున్నట్టు సమాచారం.



మణికొండ మున్సిపల్ కార్యాలయం



నార్సింగి మున్సిపల్ కార్యాలయం

నార్సింగిలో..

నార్సింగి మున్సిపాలిటీ పరిధిలో మొత్తం 18 స్థానాలు ఉండగా.. గత మున్సిపల్ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ 8 స్థానాలను దక్కించుకోగా.. గతేడాది మంచిరేవులకు చెందిన పద్మ వీరారెడ్డి కాంగ్రెస్‌ను వీడి బీజేపీలో చేరారు. ఇటీవల అసెంబ్లీ ఎన్నికల సమయంలో 17వ వార్డు కౌన్సిలర్ ఉషారాణి సైతం బీఆర్‌ఎస్‌లో చేరింది. దీంతో కాంగ్రెస్ బలం 8నుంచి 6కు పడిపోయింది. బీఆర్‌ఎస్ పార్టీ నుంచి 7 మంది సభ్యులు గెలుపొందగా.. వట్టినాగులపల్లి స్వతంత్ర్య కౌన్సిలర్ యాదమ్మ మద్దతు, బీజేపీ కౌన్సిలర్ ఆదిత్యరెడ్డి గైర్హాజరు, ఎమ్మెల్యే, ఎంపీ ఎక్స్‌అఫిషియో ఓట్లతో అప్పట్లో నాటకీయ పరిణామాల మధ్య మున్సిపాలిటీని దక్కించుకున్నారు.

◆ ప్రస్తుతం 8వ వార్డు నుంచి గెలుపొందిన స్వతంత్ర కౌన్సిలర్ ప్రవీణ్‌కుమార్, కాంగ్రెస్ నుంచి గెలుపొందిన 14వ వార్డు కౌన్సిలర్ ఉషారాణిలు బీఆర్‌ఎస్‌లో చేరటం, వట్టినాగులపల్లి స్వతంత్ర కౌన్సిలర్ యాదమ్మ మద్దతు అలాగే కొనసాగుతుండటంతో ఏకంగా వారి బలం 10కి చేరింది.

◆ బీజేపీకి ఎన్నికల సమయంలో ఒక సభ్యుడు ఉండగా కాంగ్రెస్ నుంచి మరొకరు చేరడంతో వారి బలం 2కు పెరిగింది. ప్రస్తుతం ఉన్న బలాల ప్రకారం ఇక్కడ అవిశ్వాసానికి అవకాశం లేకపోయినా చైర్మన్ ఎన్నిక సమయంలో చేసుకున్న ఒప్పందం ప్రకారం అవిశ్వాసం పెట్టి పదవిని తమకు అప్పగించాలని కొందరు ప్రయత్నాలు చేస్తున్నారు.

◆ జంట మున్సిపాలిటీలలో ప్రస్తుత చైర్మన్‌లను దించాలనే బలం పెద్దగా లేకపోయినా.. ఎవరి ప్రయత్నాలు వారు చేస్తుండటంతో మిగతా కౌన్సిలర్లు, అధికారులు పరిణామాలను గమనించడంతో పాటు వాటిపై ప్రజల్లోనూ చర్చ కొనసాగుతుంది.

ప్రజా ప్రతినిధులపై స్థానికుల ఆగ్రహం

అత్తాపూర్: ఎన్నికల సమయాల్లోనే కనిపించే ప్రజాప్రతినిధులపై తీరుపై అత్తాపూర్ బస్తీవాసులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అత్తాపూర్ తేజస్వినికాలనీ సమీపంలో 30 ఏళ్ల క్రితం బస్తీ వెలిసింది. ఇరుకైన రోడ్లు, ఆధునీకరించని డ్రైనేజీ వ్యవస్థ, తాగునీటి సరఫరాలేని ప్రాంతం, కచ్చా మోరీలతో ఆ ప్రాంతమంతా కనిపిస్తుంటుంది. సమస్యలను పట్టించుకోవాల్సిన జీహెచ్‌ఎంసీ అధికారులు కూడా ఇటువైపు కన్నెత్తి కూడా చూడడం లేదనే విమర్శలున్నాయి. స్థానిక నాయకులు పట్టించుకోకపోవడం, స్థానిక సమస్యలపై దృష్టి పెట్టకపోవడంతోనే ఈ సమస్యలు అధికమవుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. నిరుపేదలు నివసిస్తున్న ప్రాంతంలో డ్రైనేజీ, తాగునీటి సరఫరా, రోడ్ల మరమ్మతులు చేయించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. కొత్త ప్రభుత్వంలోనైనా తమ బతుకులు మారుతాయని ఆశగా ఎదురు చూస్తున్నామన్నారు.

ఎమ్మెల్యే మధుసూదన్‌కు సత్కారం



ఎమ్మెల్యే మధుసూదన్‌ను సత్కరిస్తున్న నాయకులు

రాజేంద్రనగర్: మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం ఎమ్మెల్యే గోవినోళ్ల మధుసూదన్‌రెడ్డిని మణికొండలోని తన నివాసంలో శుక్రవారం మాజీ కౌన్సిలర్ కోరని దయానంద్, శివ, నరేందర్, మహాత్మ, చలపతి తదితరులు మర్యాదపూర్వకంగా కలిసి బొకే అందజేసి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

మార్షల్‌ఆర్ట్స్‌తో మంచి భవిష్యత్తు



విద్యార్థులకు సర్టిఫికెట్లను ప్రదానం చేసిన నిర్వాహకులు

శంషాబాద్: మార్షల్ ఆర్ట్స్ నైపుణ్యంతో చిన్నారులకు మంచి భవిష్యత్తు ఉంటుందని తంగిల్ మార్షల్ ఆర్ట్స్ శిక్షణ కోచ్ భగవాన్‌దాస్‌నాయక్ సూచించారు. గత ఐదు నెలలుగా శిక్షణ పొందుతున్న బెల్ట్ గ్రేడింగ్‌లో భాగంగా శుక్రవారం మధురానగర్‌కాలనీ మైదానంలో సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మార్షల్ ఆర్ట్స్ కేవలం ప్రాణరక్షణకే కాకుండా క్రమశిక్షణతో కూడిన మంచి జీవన్శైలిని కూడా అందిస్తుందన్నారు. విద్యార్థుల్లో మానసిక ధృడత్వం కూడా పెంపొందేందుకు మార్షల్ ఆర్ట్స్ దోహదం చేస్తుందన్నారు. బీఆర్‌ఎస్ నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, కాలనీ అధ్యక్షుడు రాజిరెడ్డి, విద్యార్థులు అవినాష్, రఘువీర్ గౌస్ విష్ణువర్ధన్, రుద్రచరణ్, సాత్విక్, హర్షి, అదితి, మృదుణ, త్రిగుణ, లక్షణశ్రీ, రితిష, వివేక్, అద్వైత్, ఆరాధ్య, సమిక తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్ప మహాపడి పూజ



మున్సిపల్ మేయర్ మహేందర్‌గౌడ్, అయ్యప్ప స్వాములు

బండ్లగూడ: అయ్యప్పస్వామి నామస్మరణతో బండ్లగూడ పరిసరాలు శుక్రవారం మార్మోగాయి. బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ బుర్ర మహేందర్‌గౌడ్ కుమారుడు బుర్ర వినయ్‌గౌడ్ కన్నెస్వామి ఆధ్వర్యంలో అయ్యప్ప స్వామి మహాపడి పూజను ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దైవచింతనతోనే మనిషికి మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరించాలని వినతి



ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్‌ను సన్మానిస్తున్న కార్పొరేటర్ తలారి చంద్రశేఖర్

బండ్లగూడ: తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకోనున్నట్లు ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ అన్నారు. గత కొన్నేళ్లుగా ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యను పరిష్కరించాలని శుక్రవారం బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కార్పొరేటర్ తలారి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. కార్పొరేషన్ 1వ డివిజన్ వేంకటేశ్వరనగర్, విద్యానగర్ ఫేస్–2 కాలనీలలో కొన్నేళ్లుగా తాగునీటి సమస్యను ఎదుర్కొంటున్నామన్నారు. పైపులైన్లు వేసి నెలలు గడుస్తున్నా.. వాటిలో తాగునీరు రాకపోవడంతో చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. రోజూకూలీ చేస్తేగానీ గడవని జీవితాల్లో ఒక ట్యాంకర్ రూ.2 వేల చొప్పున నెలకు 4 ట్యాంకర్లు కొంటున్నారని, సదరు విషయం ఎమ్మెల్యేకు వివరించామన్నారు. ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ మాట్లాడుతూ.. బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ప్రతి ఇంటికి తాగునీటి సౌకర్యాన్ని కల్పించనున్నామన్నారు. ఎన్నికల కోడ్ రావడంతో అర్థాంతరంగా పనులను పూర్తి చేయలేకపోయామని, త్వరలోనే పనులు పూర్తి చేస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్లు సమచారం. ఈ విషయమై జలమండలి జీఎం రవీందర్‌రెడ్డికి ఫోన్ చేసి తాగునీటిని సరఫరా చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా నాల్గోసారి ఎమ్మెల్యేగా విజయం సాధించిన ఎమ్మెల్యేను పూలమాలలు అందించి శాలువాలతో ఘనంగా సన్మానించారు. తలారి ప్రేమ్‌కుమార్, బత్తుల నరేందర్, కృష్ణసాగర్, నాగిరెడ్డి, సిద్దయ్య, రాము, విజయ్, వెంకటయ్య తదితరులున్నారు.

కరాచీ బేకరి బాధితులను అపోలోకు తరలింపు

శంషాబాద్ : కరాచీ బేకరి పరిశ్రమలో అగ్నిప్రమాదంలో గాయపడి స్థానికంగా చికిత్స పొందుతున్న మిగతా ముగ్గురు బాధితులను కూడా పోలీసులు డీఆర్‌డీఎల్ అపోలో ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యచికిత్సల కోసం అపోలో ఆసుపత్రికి తరలించినట్లు పోలీసులు పేర్కొన్నారు. గాయపడిన మొత్తం 15 మంది కార్మికులు కూడా ప్రస్తుతం డీఆర్‌డీఎల్ అపోలో ఆసుపత్రిలోనే చికిత్స పొందుతున్నారు. ఈ ఘటనలో 5 మందికి యాభై నుంచి 80 శాతం వరకు కాలిన గాయలయ్యాయి.

మిల్లెట్ క్రిస్మస్ ట్రీ



గచ్చిబౌలి: మిల్లెట్స్‌తో క్రిస్మస్ ట్రీని రూపొందించారు. శుక్రవారం గచ్చిబౌలిలోని రాడిసన్ హోటల్‌లో అంతర్జాతీయ మిల్లెట్స్ సంవత్సరాన్ని పురస్కరించుకొని మిల్లెట్స్‌తో తయారు చేసిన క్రిస్మస్ ట్రీని ఆవిష్కరించారు. ఏడు రకాలైన ఫాక్సీటైల్ మిల్లెట్, బార్న్‌యార్డ్ మిల్లెట్ , పెర్ల్ మిల్లెట్, జొన్న మిల్లెట్, లిటిల్ మిల్లెట్, కోడో మిల్లెట్, ఫింగర్ మిల్లెట్లను క్రిస్మస్ ట్రీ తయారీలో ఉపయోగించారు. పది అడుగుల ఎత్తు, రెండున్నర అడుగుల వెడల్పు, పది కిలోల బరువుతో తయారుచేశారు. చిరు ధాన్యాలపై అవగాహన, ప్రోత్సహించేందుకు క్రిస్మస్ ట్రీ ని రూపొందించినట్లు మంజీరా హోటల్స్ అండ్ రిసార్ట్స్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ ఎం.వి.గణేష్ తెలిపారు.

ఖాజాగూడ జంక్షన్ మూసివేత

గచ్చిబౌలి: ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించడంలో భాగంగా ఖాజాగూడ జంక్షన్‌ను మూసివేస్తున్నట్లు రాయదుర్గం ట్రాఫిక్ సీఐ శ్రీనాథ్ ఒక ప్రకటనలో తెలిపారు. షేక్‌పేట్ ఫ్లైఓవర్, నానక్‌రాంగూడ రోటరీ, బయోడైవర్సిటీ జంక్షన్‌ల నుంచి వచ్చే వాహనాల రద్దీతో ఖాజాగూడ జంక్షన్ జాం అవుతోంది, ఈ క్రమంలో శనివారం నుంచి ఖాజాగూడ జంక్షన్ మూసివేయనున్నారు. నానక్‌రాంగూడ రోటరీ నుంచి విస్పర్‌వ్యాలీ వైపు వెళ్లే వాహనదారులు పక్వాన్ హోటల్ ముందు యూటర్న్ తీసుకోవాలి. షేక్‌పేట్ ఫ్లైఓవర్ నుంచి వాహనదారులు ఫిలింనగర్ వైపు వెళ్లాలంటే పక్వాన్ హోటల్ వద్ద యూటర్న్ తీసుకోవాలని, బయోడైవర్సిటీ జంక్షన్ నుంచి మణికొండ వెళ్లాలనుకునే వారు షేక్‌పేట్ ఫ్లైఓవర్ కింద యూటర్న్ తీసుకోవాలని ట్రాఫిక్ పోలీసులు సూచిస్తున్నారు.

ఆటోవాలాల బతుకులు ఆగమౌతున్నాయి !

బీఎంఎస్ ఆటో, టాక్సీ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు నందకిశోర్‌గుప్తా



మాట్లాడుతున్న నందకిశోర్ గుప్తా తదితరులు

శంషాబాద్: రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఉచితబస్సు సౌకర్యం కల్పించడం సంతోషకరమైనప్పటికీ ఆటోలపై జీవనాధారం కలిగిన వేలాది కుటుంబాలు ఆగమౌతున్నాయని, భారతీయమజ్దూర్‌సంఘ్ ఆటో, టాక్సీ డ్రైవర్ల విభాగం రాష్ట్ర అధ్యక్షుడు చింతల నందకిశోర్ గుప్తా అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. అద్దెకు ఆటోలు నడిపేవారు అద్దె చెల్లించుకోలేని పరిస్థితి.. రుణాలతో కొన్నవారు ఈఎంఐలు కట్టలేని దుస్థితి నెలకొనే ప్రమాదముందన్నారు. ఇప్పటికే రోజువారీ ఖర్చులు కూడా సంపాదించుకోలేకపోతున్నారన్నారు. నెలరోజుల సంపాదనను ప్రభుత్వం ఏడాది మొత్తానికి ఇవ్వాలనుకున్న నిర్ణయం కూడా సమంజసంగా లేదన్నారు. ఈనెల 16 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా మండల స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు ప్రజాప్రతినిధులకు విజ్ఞప్తులను అందజేయడంతో పాటు నిరసన కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎండీ సయ్యద్, జగదీష్, మల్లేష్, దినేష్, సోహైల్, రవి, రంజిత్, శ్రీను, కృష్ణ, శివ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిత్వ వికాసానికి అధిక ప్రాధాన్యం



ప్రిన్సిపల్ ఉషశ్రీ, కళాశాల ప్లేస్‌మెంట్ ఆఫీసర్స్ డాక్టర్ సుబ్బారెడ్డి

అత్తాపూర్: ఆంగ్లభాషలో పట్టు సాధించడంతో పాటు వ్యక్తిత్వ వికాసానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఇంజినీరింగ్ విద్యార్థులపై ఉందని మహవీర్ ఇంజినీరింగ్ కళాశాల సెక్రటరీ సంరెడ్డి సురేందర్‌రెడ్డి, కళాశాల జాయింట్ సెక్రటరీ సంరెడ్డి ధనుంజయరెడ్డి అన్నారు. శుక్రవారం కళాశాలలో నిర్వహించిన ఎక్సెల్లర్ ఐటీ కంపెనీలో మహవీర్ ఇంజినీరింగ్ కళాశాలలో చదువుతున్న 22 మంది విద్యార్థులకు ప్లేస్‌మెంట్ లభించింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మారుతున్న కాలానికి అనుగుణంగా నూతన సాంకేతికతను జోడించి నూతన శకానికి పునాది వేసుకోవాల్సిన బాధ్యత విద్యార్థులపై ఉందన్నారు. కళాశాలలో ఉన్న వనరులను సద్వినియోగం చేసుకుంటూ.. ముందుకెళ్లాలని విద్యార్థులకు సూచించారు. ప్లేస్‌మెంట్ సాధించిన విద్యార్థులను ఈ సందర్భంగా అభినందించారు. ప్రిన్సిపల్ ఉషశ్రీ, కళాశాల ప్లేస్‌మెంట్ ఆఫీసర్స్ డాక్టర్ సుబ్బారెడ్డి, నందగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

అత్యధిక పేటెంట్లలో జపాన్‌ది అగ్రస్థానం

- భారత్ తన పరిశోధనలను మరింత పెంచాలి
- 'మనూ' లీగల్ స్టడీస్‌ప్రొఫెసర్ తబ్రేజ్ అహ్మద్

రాయదుర్గం: సైన్స్ అండ్ టెక్నాలజీలో దేశం యొక్క పురోగతిని పేటెంట్ల పరంగా కొలుస్తారని మనూ లీగల్ స్టడీస్ ప్రొఫెసర్ తబ్రేజ్ అహ్మద్ పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని ఉర్దూ విశ్వవిద్యాలయంలో శుక్రవారం 'మేథో సంపత్తి- హక్కులు' అనే అంశంపై ప్రత్యేక ఉపన్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అత్యధిక పేటెంట్లతో జపాన్ అగ్రస్థానంలో ఉందని, చైనా ముందుకు దూసుకుపోతోందన్నారు. భారతదేశం తన పరిశోధనలను మరింత పటిష్టం చేయాలని సూచించారు. యూనివర్సిటీలు నాణ్యమైన పరిశోధనలను ప్రోత్సహించాలన్నారు. వీసీ ఐనుల్‌హసన్ మాట్లాడుతూ నాణ్యమైన పరిశోధన అవసరమన్నారు. కార్యక్రమంలో పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగం హెడ్ డాక్టర్ సయ్యద్ నజీవుల్లా, ప్రొఫెసర్ కనీజ్ జెహ్రా, డాక్టర్ సుధాంశుచంద్ర ప్రసంగించారు. అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గంటల వ్యవధిలోనే బాధితుడికి బంగారం అప్పగింత



బ్రాస్లెట్లను అందజేస్తున్న అత్తాపూర్ ఇన్‌స్పెక్టర్ పులి యాదగిరి, ఎస్సై నాగరాజు

అత్తాపూర్: బంగారం పోగొట్టుకున్న వ్యక్తికి గంటల వ్యవధిలోనే రెండున్నర తులాల బంగారు బ్రాస్లెట్‌ను గుర్తించి బాధితుడికి అత్తాపూర్ పోలీసులు శుక్రవారం అందజేశారు. అత్తాపూర్ ఇన్‌స్పెక్టర్ పులి యాదగిరి, ఎస్సై నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. పీవీ నర్సింహారావు ఎక్స్‌ప్రేస్ వే పిల్లర్ నంబర్ 230 ప్రాంతంలో ఉన్న హెరిటేజ్ ఫంక్షన్‌హాల్‌లో సమీప బంధువుల వివాహానికి యాదగిరి కుటుంబసభ్యులతో కలిసి హాజరయ్యాడు. పెళ్లి వేడుకల్లో భాగంగా హడావిడిలో ఉన్న యాదగిరి చేతిలోని బ్రాస్లెట్ పడిపోయింది. పడిపోయిన బ్రాస్లెట్‌ను ఓ వ్యక్తి గమనించి తీసుకుని పరారయ్యాడు. దీనిపై బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుతో అత్తాపూర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని సీసీ కెమెరాల ఆధారంగా సదరు వ్యక్తిని గుర్తించి ఆ బంగారాన్ని యాదగిరి కుటుంబసభ్యులు పోలీస్‌స్టేషన్‌లో అందజేశారు. ఈ మేరకు నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

సీఎం రిలీఫ్ ఫండ్ ఎల్‌ఓసీ అందజేత

బండ్లగూడ: ప్రజల కష్టాలను తెలుసుకుని వారికి అండదండగా ఉంటున్నామని బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ బుర్ర మహేందర్‌గౌడ్ అన్నారు. కార్పొరేషన్ హిమాయత్‌సాగర్ ఎస్సీ బస్తీకి చెందిన లాలయ్యకు గత కొంత కాలంగా మోకాళ్ల నొప్పితో బాధపడుతున్నాడు. ఈ విషయం ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ దృష్టికి తీసుకెళ్లగా.. ఆయన రూ.లక్ష సీఎం రిలీఫ్ ఫండ్ ఎల్‌ఓసీని మంజూరు చేశారన్నారు. ఈ పత్రాన్ని శుక్రవారం బాధితుడి భార్య సాలమ్మకు అందించామన్నారు. బీఆర్‌ఎస్ కార్పొరేషన్ అధ్యక్షుడు గోకరి సురేష్‌గౌడ్ తదితరులున్నారు.



ఎల్‌ఓసీ పత్రాన్ని అందజేస్తున్న మున్సిపల్ మేయర్ మహేందర్‌గౌడ్

22 నుంచి హైదరాబాద్ కిడ్స్ ఫెయిర్-2023



బ్రోచర్‌ను విడుదల చేసిన హైటెక్స్ బిజినెస్ హెడ్ శ్రీకాంత్ తదితరులు

మాదాపూర్: విద్య, జీవనశైలి, పోషకాహారం, అభిరుచులు నాలుగు కీలక విభాగాలలో ఉత్పత్తులు, సేవలతో ప్రదర్శన ఉంటుందని హైటెక్స్ బిజినెస్ హెడ్ శ్రీకాంత్ టీజీ తెలిపారు. శుక్రవారం మాదాపూర్‌లోని హైటెక్స్ సెంటర్‌లో హైదరాబాద్ కిడ్స్ ఫెయిర్ 2023కి సంబంధించిన వివరాలను విలేకరుల సమావేశంలో వెల్లడించారు. అనంతరం బ్రోచర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 22 నుంచి 24వ తేదీ వరకు హైటెక్స్‌లో ఫెయిర్ నిర్వహించనున్నట్టు తెలిపారు. ప్రదర్శనలో పిల్లల పరుగు, భారీసైజు జింగా, పిల్లల ఫ్యాషన్ షో, బ్యాడ్మింటన్, బాస్కెట్ బాల్ చాంపియన్‌షిప్‌లు, ఫ్లూయిడ్ ఆర్ట్ కార్యక్రమాలను ఉంటాయన్నారు. కాంటినెంటల్ హాస్పిటల్ వైస్ ప్రెసిటెండ్ స్మితా చౌదరి, హోలి జాలీ డైరెక్టర్ అఖిల భూపతిరాజు, లైఫ్‌స్పామ్ ప్రైవేట్ లిమిటెడ్ వైస్ ప్రెసిడెంట్ వంశీకృష్ణ, హైదరాబాద్ రన్నర్స్ జనరల్ సెక్రటీ అరుణ్‌కుమార్, నటి ప్రజ్ఞ్యానయన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించేలా ప్రోత్సహించాలి

- నిఫ్ట్ హైదరాబాద్ డైరెక్టర్ అవినాష్ రాయ్‌పల్లి
- కేవీలో వార్షిక క్రీడోత్సవాలు

రాయదుర్గం: కేంద్రీయ విద్యాలయం గచ్చిబౌలి వార్షిక క్రీడోత్సవాలు ఉత్సాహంగా సాగాయి. శుక్రవారం జీపీఆర్‌ఏ క్వార్టర్స్‌లోని కేంద్రీయ విద్యాలయలో ప్రిన్సిపల్ జితేంద్రకుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన వార్షిక క్రీడోత్సవాలను నిఫ్ట్ హైదరాబాద్ డైరెక్టర్ అవినాష్ రాయ్‌పల్లి ప్రారంభించారు. అనంతరం విజేతలకు బహుమతులను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువుతోపాటు విద్యార్థులు క్రీడల పట్ల కూడా ఆసక్తి కనబర్చాలని సూచించారు. విద్యార్థులు క్రీడల్లో రాణించేలా ఉపాధ్యాయులు,తల్లిదండ్రులు ప్రోత్సహించాలన్నారు. అంతకుముందు విద్యార్థులచే గౌరవ వందనం స్వీకరించారు.

వ్యవస్థాపక దినోత్సవం

కేంద్రీయ విద్యాలయ గచ్చిబౌలిలో 60వ వ్యవస్థాపక దినోత్సవాన్ని కూడా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ జితేంద్రకుమార్ ఆధ్వర్యంలో అధ్యాపకులు, ఉపాధ్యాయుల పర్యవేక్షణలో విద్యార్థులు పలు కార్యక్రమాలను నిర్వహించారు.

అధికారుల పనితీరు మరింత మెరుగుపర్చుకోవాలి

బండ్లగూడ: అన్ని శాఖల అధికారులు, సిబ్బంది పనితీరును మరింత మెరుగు పరుచుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ శరత్‌చంద్ర అన్నారు. కార్పొరేషన్ కౌన్సిల్‌హాల్‌లో శుక్రవారం అన్ని శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రతి విభాగం నుంచి రివ్యూ తీసుకుని బిల్ కలెక్టర్లు తప్పకుండా ఇంటిపన్ను వసూలు చేయాలని సూచించారు. అభివృద్ధి పనులు, అన్ని కాలనీల్లోని రోడ్లు, జీవీపీ పాయింట్స్, శానిటేషన్, వీధిదీపాలు నిర్వహణపై అధికారులు, సిబ్బందికి ఆయన పలు సలహాలు, సూచనలు అందించారు. అనంతరం కమిషనర్ శరత్‌చంద్ర మాట్లాడుతూ.. అన్ని శాఖల అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని, అందరి సమిష్టి కృషి ఎంతో ముఖ్యమన్నారు. అందరం కలిసి కట్టుగా పనిచేస్తేనే ప్రజలకు మరింత మెరుగైన సౌకర్యాలను అందించగలమన్నారు. అభివృద్ధి పనుల్లో ప్రజలను భాగస్వామ్యం చేయాలని సూచించారు.

పరిసరాల పరిశుభ్రతపై..

రోడ్లపై చెత్తచెదారాలు వేయకుండా అవగాహన కార్యక్రమాలను మరింత ముమ్మరం చేయాలని, పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్‌ను స్వచ్ఛ కార్పొరేషన్‌గా తీర్చిదిద్దేందుకు తగిన చర్యలు తీసుకుంటామన్నారు. దీనికి అన్ని శాఖల అధికారుల తోడ్పాటు ఎంతో అవసరమన్నారు. అభివృద్ధి పనుల్లో ఎలాంటి అలసత్వం ప్రదర్శించవద్దన్నారు. ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని పరిష్కరించాలన్నారు. ఎస్ఈ ఆర్.శివానంద్, డిప్యూటీ ఈఈ యాదయ్య, ఏఈ రాజ్‌కుమార్, ఆర్‌ఓ నిర్మల, ఆర్ఐ జగన్‌మోహన్, నరేష్, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్, వార్డు అధికారులు, కంప్యూటర్ ఆపరేటర్లు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు, బిల్ కలెక్టర్లు, రిసోర్స్ పర్సన్లు, జవాన్లు తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ శ్రీలత



మాట్లాడుతున్న మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ శరత్‌చంద్ర

వినతిపత్రం అందజేత..

బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 18వ డివిజన్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని శుక్రవారం కార్పొరేటర్ గోకరి శ్రీలతసురేష్‌గౌడ్ ఆధ్వర్యంలో కమిషనర్ శరత్‌చంద్రను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. 18వ డివిజన్‌లోని వివిధ కాలనీలలో సమస్యలు రోజురోజుకు పెరిగిపోతున్నాయని, కుక్కల బెడద తీవ్రంగా ఉందన్నారు. ప్రజలు రోడ్లపై నడిచేందుకు వీలు లేకుండా కుక్కలు గుంపులు గుంపులుగా తిరుగుతూ.. ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నాయన్నారు. వీధిలైట్లు, రోడ్లు, తదితర సమస్యలను త్వరగా పరిష్కరించాలని కమిషనర్‌ను కోరామన్నారు. సానుకూలంగా స్పందించిన ఆయన త్వరలోనే తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారన్నారు.

బైక్ ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి



వ్యక్తి మృతదేహం

శంషాబాద్ రూరల్ : బైక్ ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన మండల పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ శ్రీధర్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. నర్కూడ శివారులో శంషాబాద్–షాబాద్ రహదారిపై గురువారం రాత్రి నడుచుకుంటూ.. వెళ్తున్న గుర్తు తెలియని వ్యక్తి (35)ని బైక్ ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. అతడిని చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించగా.. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. ప్రమాదానికి కారణమైన సుల్తాన్‌పల్లికి చెందిన మక్సూద్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

శిల్పారామంలో హస్తకళా ప్రదర్శన ప్రారంభం

- ఆకట్టుకున్న కూచిపూడి నృత్యప్రదర్శన

మాదాపూర్: మాదాపూర్‌లోని శిల్పారామంలో ఆలిండియా క్రాఫ్ట్ మేళా- 2023 శుక్రవారం ప్రారంభమైంది. ఈ మేళాలో వివిధ రాష్ట్రాల చేనేత హస్తకళా ఉత్పత్తులు కొలువుదీరాయి. బనారసీ, చికన్‌కర్, టస్సర్, మంగళగిరి, గద్వాల్, మహేశ్వరం, పెయింటింగ్ చీరలు, చెక్క బొమ్మలు, విగ్రహాలు , గుజరాతీ శాలువాలు, ఇత్తడి విగ్రహాలు అందుబాటులో ఉన్నాయి. మేళా సందర్భంగా శిల్పారామంలో నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా సంధ్యారాజు శిష్యబృందం కూచిపూడి నృత్యప్రదర్శన అలరించింది. ఇందులో పూజ నృత్యం, తరంగం, శివాష్టకం, రుక్మిణీ ప్రవేశం, మరకత మణిమయ, అన్నమాచార్య కీర్తనలను సత్య, శరణ్య, శ్రియ, శ్రావ్య, లక్ష్మీ, పార్థవ, పింకి, ప్రద్యోత తదితరులు పాల్గొన్నారు.